# అభివృద్ధి దిశగా ఆసియా దేశాలు..!

**స్వదేశీ డిమాండ్ మెరుగవడం.. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ప్రోత్సాహక వాతావరణ నేపథ్యంలో.. ఆసియా దేశాల వృద్ధి వేగవంతమైందని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) అభిప్రాయపడింది. అభివృద్ధి చెందుతున్న ఆసియా దేశాలు.. 2006లో 8.3 శాతం, 2007లో 7.6 శాతం, 2008లో 7.7 శాతం వృద్ధి నమోదు చేసుకున్నట్లు తెలిపింది. ఈ ప్రాంతంలో ఆర్థిక విస్తరణ వేగవంతమవ డానికి చైనా, భారత్‌లు సాధిస్తున్న వృద్ధి కారణమంది. దక్షిణ తూర్పు ఆసియా, తూర్పు ఆసియా దేశాలకు సంబంధించి ఏడీబీ విడుదల చేసిన నివేదికలోని ముఖ్యాంశాలు...**

ఆసియాలోని అనేక దేశాల్లో అమల్లో ఉన్న స్థూల ఆర్థిక యాజమాన్య విధానాలు.. ఈ ప్రాంత దేశాలలో ఆర్థిక పురోగతిని ప్రోత్సహించగలవు. అంతర్జాతీయంగా చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో ఏర్పడిన ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను ఎదుర్కోవడానికి అవలంభించిన కఠిన ద్రవ్య విధానాలు సత్ఫలితాల నిచ్చాయి. అభివృద్ధి చెందిన దేశాల వృద్ధి మందగించిన నేపథ్యంలో... ఈ ఖండంలోని దేశాల కరంట్ అకౌంట్ మిగులు సన్నగిల్లింది. చైనా ఎగుమతులు పెరగడం, స్థిర ఆస్తులపై పెట్టుబడుల (fixed asset investment) వల్ల అధిక వృద్ధి సాధ్యమైంది. ధరల్లో ఒడిదొడుకులు,చమురు సరఫరాలో ఆటంకాలు, రక్షణ విధానానికి సంబంధించి ఒత్తిళ్ల పెరగడం.. ఆసియా దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు.

భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధికి సేవారంగం కూడా తోడ్పాటునందించడం వల్ల 2006 నుంచి అధిక వృద్ధి సాధ్యమ వుతోంది. ఒకవైపు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మరోవైపు పరపతి వృద్ధి వేగవంతమైనందువల్ల కేంద్ర బ్యాంకు వడ్డీరేట్లు పెంచడంతో.. పెట్టుబడి రంగానికి (ప్రాపర్టీ సెక్టర్) ఇచ్చే రుణం తగ్గింది. ఈ నివేదిక ప్రకారం భారతదేశ ఆర్థిక వృద్ధి 2007లో 8 శాతం కాగా 2008లో 8.3 శాతంగా ఉండగలదని అంచనా. ఆర్థిక సంస్కర ణలు మందగించడం, వ్యవసాయ ఉత్పాదకతలో వృద్ధి తగ్గడం.. వృద్ధి లక్ష్యాలను అందుకోలేకపోవడానికి కారణాలుగా నివేదిక పేర్కొంది.

## దక్షిణ తూర్పు ఆసియా దేశాలు:

దక్షిణ తూర్పు ఆసియా దేశాల వృద్ధి 2007లో 5.6 శాతం కాగా, 2008లో 5.9 శాతం వృద్ధిని సాధించే అవకాశముంది. 2007లో వృద్ధిరేటు తగ్గడానికి ఎగుమతుల వృద్ధి క్షీణించడం కూడా కారణం. ఈ దేశాల్లో



ఇండోనేషియా,వియత్నాం 2007లో కొంతమేరకు వృద్ధి సాధించాయి. ఇతర దక్షిణ తూర్పు ఆసియా దేశాలు ఇటీవల కాలంలో మంచి వృద్ధి సాధిస్తున్నప్పటికీ సాంఘిక అభివృద్ధి, పేదరిక నిర్మూలన సాధించటం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. 2007లో ద్రవ్యోల్బణం 4.2 శాతానికి తగ్గింది. చమురు ధరలు తగ్గడం, ఉపప్రాంత కరెన్సీ విలువ పెరగడం, వ్యవసాయ ఉత్పత్తికి సంబంధించి వాతా వరణం అనుకూలించడం లాంటివి ద్రవ్యోల్బణం తగ్గుదలకు కారణమైంది. పెట్టుబడులు పెరిగినందువల్ల దక్షిణ తూర్పు ఆసియా ప్రాంతానికి దిగుమతులు పెరిగాయి. ముఖ్యంగా ఇండోనేషియాలో పర్యాటకరంగ రాబడి పెరగడం,ఇతర దేశాల్లో పని చేస్తున్న ఇండోనేషియా శ్రామికుల నుంచి remittances పెరగడంతో కరంట్ అకౌంట్‌లో మిగులు నమోదైంది. ఈ ప్రాంతంలోని కొన్ని దేశాల్లో ఆర్థిక పురోగతి అనిశ్చితంగా ఉండటానికి రాజకీయపరమైన కారణాలను పేర్కొనవచ్చు. థాయ్‌లాండ్‌లో వాణిజ్యం పట్ల ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో విశ్వాసం తగ్గింది. వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం, వివిధ దేశాల్లోని పటిష్టమైన ద్రవ్య పరిస్థితులు 2007లో ఈ ప్రాంతంలో వ్యవసాయ రంగానికి అనుకూలంగా మారాయి. దక్షిణ తూర్పు ఆసియా దేశాల ఎగుమతులు పెరగడం వల్ల కంబోడియా, వియత్నాంల వృద్ధిరేటు పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్‌కు పెరిగిన డిమాండ్ వల్ల ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, మలేషియాలు లబ్ధిపొందాయి. వస్త్ర ఎగుమతులు పెరగడం, టూరిజం రాబడి పెరగడం, నిర్మాణ కార్యక్రమాలు వేగవంతం కావడంతో కంబోడియా ఆర్థిక ప్రగతి మెరుగైంది. స్వదేశీ ఆర్థిక కార్యకలాపాలు పెరిగినందువల్ల 2008లో కంబోడియా 9 శాతం వృద్ధి సాధించగలదని అంచనా. మలేషియాలో వినియోగ వ్యయం పెరుగుదల వృద్ధిరేటు పెరుగుదలకు కారణమైంది. పబ్లిక్, ప్రైవేటు పెట్టుబడులు ఈ దేశంలో పెరిగాయి. 2007లో మలేషియా ఆశించిన వృద్ధి అందుకోకపోవడానికి ఎగుమతుల మార్కెట్ మందగించడం, వినియోగ వ్యయం, ప్రైవేటు పెట్టుబడులు తగ్గడం కారణం. మయన్మార్‌లో ఆర్థిక విస్తరణకు సహజవాయు ఎగుమతుల ధరల పెరుగుదలతో పాటు పంటల ఉత్పత్తి మెరుగుపడటం ఒక కారణం. స్థూల దేశీయోత్పత్తిలో పెట్టుబడి రేటు తగ్గడం వల్ల తగినంత ఉద్యోగితను పెంచుకోగలిగే వృద్ధిని ఫిలిప్పీన్స్ సాధించలేకపోయింది. నిర్మాణా

SAKSHI

త్మక మార్పులు, ప్రపంచ ఆర్థిక నెట్‌వర్క్‌తో దగ్గర సంబంధాల వల్ల సింగపూర్ 2006లో 7.9 శాతం వృద్ధి, 2007లో 6 శాతం వృద్ధిని నమోదు చేయగలిగింది. థాయ్‌లాండ్‌లో వడ్డీరేట్ల పెరుగుదల, వరదలు, ద్రవ్యోల్బణ పరిస్థితుల వల్ల స్వదేశీ డిమాండ్ తగ్గింది. 2007లో థాయ్‌లాండ్ 4 శాతం ఆర్థిక వృద్ధిని సాధించగా, 2008లో ఆర్థిక విస్తరణ ఎన్నికల అనంతరం ఏర్పడే ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగే పరిస్థితులను బట్టి ఉండగలదని నివేదిక అంచనా వేసింది. 2007, 2008లో వియత్నాంలో ఆర్థిక వృద్ధి 8 శాతం మేరకు ఉండగల దని నివేదిక అభిప్రాయపడింది. ఎగుమతుల వృద్ధి, వినియోగ వ్యయం పెరుగుదల, పెట్టుబడి రేటు పెరుగుదల వియత్నాంలో వృద్ధికి కారణంగా పేర్కొనవచ్చు.

## తూర్పు ఆసియా దేశాలు:

2006లో 8.7 శాతం వృద్ధిని నమోదు చేసుకొన్న తూర్పు ఆసియా దేశాలు, 2007లో 8 శాతం వృద్ధిని మాత్రమే సాధించాయి. ఈ ప్రాంతంలోని దేశాల వృద్ధికి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా సాధించిన వృద్ధి ఎంతో తోడ్పడింది. ఈ ప్రాంతంలో 2006లో ద్రవ్యోల్బణం 1.6 శాతం కాగా, 2007లో 2 శాతం కన్నా తక్కువ. తయారీ, నిర్మాణరం గాల వల్ల చైనాలో అధికవృద్ధి సాధ్యమైంది. చైనాలో గ్రామీణాభివృద్ధి పథకాల వల్ల వ్యవసాయరంగానికి మంచి లాభం చేకూరుతుంది. దీనివల్ల 2007-2011 మధ్య కాలంలో చైనా స్థూల దేశీయోత్పత్తి వృద్ధి 9 శాతంగా ఉండగలదని నివేదిక అభిప్రాయపడింది. స్వదేశీ డిమాం డ్‌లో రికవరీ, ఎగుమతుల వృద్ధిలో పెరుగుదల వల్ల రిపబ్లిక్ ఆఫ్ కొరియా వృద్ధిలో పురోగతి కనిపిస్తోంది. 2003లో ఈ దేశంలో క్రెడిట్ కార్డ్‌ల సంక్షోభం తర్వాత ప్రైవేటు వినియోగంలో గణనీయమైనవృద్ధి చోటుచేసుకుంది. తర్వాత కాలంలో ఈ దేశంలో మూలధన పెట్టుబ డులు పెరిగాయి. యంత్రాలు, యంత్ర పరికరాలపైనే స్వదేశీ కంపెనీ లు ఎక్కువ పెట్టుబడులు పెట్టాయి. తయారీ రంగం, గృహరంగంపై పెట్టుబడులు పెంచడం ద్వారా ఈ దేశంలో వృద్ధి పెరగగలదని ఏడీబీ అభిప్రాయపడింది. మైనింగ్, వ్యవసాయ రంగంపై ఆధారపడిన మంగోలియా 2006లో 8.4 శాతం వృద్ధి సాధించగా, 2007లో వృద్ధి మందగించింది. కాపర్, బంగారం ధరల పెరుగుదల మంగోలియా వృద్ధికి కారణమయ్యాయి.

- మధ్య ఆసియా దేశాలు:
  - ఆర్మేనియా, అజర్ బైజాన్, కజకిస్థాన్, తజకిస్థాన్, యర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్
- తూర్పు ఆసియాలో ముఖ్య దేశాలు:
  - చైనా, హాంకాంగ్, కొరియా, మంగోలియా
- దక్షిణ ఆసియా దేశాలు:
  - అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక
- దక్షిణ తూర్పు ఆసియా దేశాలు:
  - కంబోడియా, ఇండోనేషియా, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం

SAKSHI